'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పాలన చేతకాదు.. నోటి దురుసు పోదు!

బుద్ధా మురళి

కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడానికి నిధులు కావాలి. నిధులు కావాలంటే సంపదను సృష్టించే తెలివితేటలు ఉండాలి. రాష్ట్ర ఆదాయం పెంచే ప్రణాళికలు రూపొందించాలి. పెట్టుబడులను ఆకర్షించే విధానాలు అమలుచేయాలి. కానీ, బూతులు తిట్టడానికి అవేవీ అక్కర్లేదు. సంస్కారం అడ్డు రాని నోరుంటే చాలు. తన బిడ్డ విదేశీ విద్యానిధి కోసం దరఖాస్తు చేసి ఏడాదైనా నిధులు మంజూరు కావడం లేదని బాధపడుతున్న బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ తండ్రికి నేను ఇచ్చిన సమాధానమిది.

విదేశీ విద్య చదివే వివిధ కులాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసింది. విమాన టికెట్‌తో పాటు ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు సాయం అందించింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వలేదు. ఈ పథకానికి నిధులు ఇచ్చే సూచనలు కనిపించకపోవడంతో బ్రాహ్మణ పరిషత్ ఈసారి కనీసం దరఖాస్తులు కూడా ఆహ్వానించలేదు. బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు తీసుకున్నా ఎలాంటి ఉలుకుపలుకు లేదు.

విదేశీ విద్యానిధి పథకం కింద నిధులు విడుదల చేస్తారేమోనని నిత్యం వెబ్ సైట్‌లో చూస్తున్న తల్లిదండ్రుల ఆశలు అడియాసలు అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే చాలామంది విద్యార్థుల చదువులు కూడా పూర్తయ్యాయి. అయినప్పటికీ, ఈ పథకానికి నిధులు విడుదల చేస్తారో, లేదో? తెలియడం లేదు. తెలంగాణలో ఈ ఒక్క పథకమే కాదు, నిధులతో ప్రమేయమున్న అన్ని పథకాల పరిస్థితి ఇలాగే ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అడ్డూఅదుపు లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి. రాహుల్‌గాంధీ పాల్గొన్న ఒక సభలో నాలుగు వేల పింఛన్ అని రాసున్న ప్లకార్డుని పట్టుకొని కేటీఆర్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ చేసిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, రేవంత్‌రెడ్డి తదితర నేతలంతా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, గద్దెనెక్కి ఏడాదైనా పింఛన్ మాత్రం పెంచలేదు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన హామీల్లో ఒక్క ఫ్రీ బస్సు మాత్రమే అమలుచేశారు. మిగిలిన హామీల ఊసే ఎత్తడం లేదు.

ప్రభుత్వ సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలు ఇచ్చారని గతంలో కేసీఆర్ సర్కార్‌ను ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయంటూ ఎన్నికలు జరుగుతున్న మహారాష్ట్రలో ప్రకటనలు ఇచ్చారు. మహిళలకు నెలకు రూ.2500, రైతుబంధు సహా అన్ని హామీలను నెరవేర్చినట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటు. వాస్తవానికి, తెలంగాణలో మహిళలకు రూ.2500, రైతుబంధు సహా అనేక పథకాలు అమలుకావడం లేదన్న విషయం అందరికీ తెలుసు. అందుకే, ప్రధాని మోదీతో పాటు బీజేపీ నేతలు తెలంగాణలో అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీల గురించి మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన కొత్త హామీల మాట దేవుడెరుగు.. గతంలో అమలవుతున్న పథకాలకే దిక్కు లేదు. కేటీఆర్‌కు సవాల్ చేసిన కోమటిరెడ్డి వెంటక్‌రెడ్డికి ఇప్పుడు దాని గురించి మాట్లాడే తీరిక లేదనుకుంటా. హామీల అమలుకు నిధులు లేవు కాబట్టి, అమలు చేయడం లేదు. కానీ, బూతులు తిట్టడానికి ఎలాంటి నిధులు అవసరం లేదు కదా? అందుకే, ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, పార్టీ నేతల వరకు తిట్ల దండకం అందుకుంటున్నారు. విచ్చలవిడిగా బూతులను ఖర్చు చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలోనూ గతంలో ఎప్పుడూ ఒక ముఖ్యమంత్రిని సామాన్యులు ఈ స్థాయిలో తిట్టలేదు. అదే విధంగా సీఎం, మంత్రులు కూడా హద్దులు మీరి పరుష పదజాలంతో మాట్లాడలేదు. అధికారంలో ఉన్నవారు హుందాగా ఉండాలి. అత్యున్నత పదవుల్లో ఉన్నవారే బూతులు మాట్లాడుతుంటే బాధితులైన సామాన్యులు మాట్లాడటం తప్పేమీ కాదు. తమ ఇండ్లు కూల్చివేస్తే, పొలాలను లాక్కొంటుంటే, ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలు ఆగ్రహించడం సహజం. అనేక కారణాల వల్ల రేవంత్‌రెడ్డికి మీడియా నుంచి ఆశించిన దానికన్నా ఎక్కువ సహకారం లభిస్తోంది. అయితే, ప్రధాన మీడియా కంటే సామాజిక మాధ్యమాల ద్వారానే ప్రజల ఆగ్రహం బయటి ప్రపంచానికి తెలుస్తున్నది. సామాజిక మాధ్యమాలు, బాధితులు స్వయంగా వీడియోలు బయటకు వదులుతుండటంతో ప్రజల ఆగ్రహం ఏ స్థాయిలో ఉందో తెలుస్తున్నది. అంతేతప్ప, మెయిన్‌స్ట్రీమ్ మీడియా ద్వారా కానే కాదు. హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇండ్ల సమస్య పరిష్కరించానని, సహకరిస్తే రెండోసారి అధికారంలోకి వస్తే రెండో విడత ఇళ్ల స్థలాలు ఇస్తానని ఓ సభలో ఇటీవల సీఎం ప్రకటించారు. తద్వారా ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టులు ఏం చేయాలో పరోక్షంగా ఆయన కర్తవ్య బోధ చేశారు. నిజానికి జర్నలిస్టుల సమస్య పదేండ్ల కిందటిది కాదు. 20 ఏండ్ల నుంచి ఆ సమస్య ఉన్నది. డబ్బులు చెల్లించిన జర్నలిస్టులు రెండు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తున్నది. ఆ సమస్య ఇంకా ఓ కొలిక్కి రాకాలేదు. 'ఏడ్చే దాని మొగుడు వస్తే నా మొగుడు వస్తా'డని ఓ సామెత చెప్పినట్టు.. మొదటి విడత జర్నలిస్టుల సమస్యే పరిష్కారం కాలేదు. ఇక రెండవ విడత ఎప్పుడో?

అడ్డమైన నాయకులకు పోలీసులు సేవ చేస్తారని, వారికి పని గంటలు ఉండాలని గతంలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియో పోలీసుల ఆందోళన సమయంలో బాగా వైరల్ అయింది. అదేవిధంగా గతంలో బీఆర్ఎస్ సర్కార్ ఇంటింటి సర్వే చేసిన సమయంలో టీడీపీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి.. 'అడ్డమైనవాళ్లు ఇంటికి వచ్చి వివరాలు అడిగితే చెప్పాలా? బుర్ర ఉన్నవాళ్లు ఎవరైనా ఇలా సర్వే చేస్తారా?' అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆస్తులతో పాటు అన్ని వివరాలు అడుగుతూ సర్వే చేయిస్తున్నారు. దాంతో రేవంత్‌రెడ్డి పాత వీడియో సోషల్ మీడియాలో మరోసారి వైరల్‌గా మారింది.

ఇంటింటికి వచ్చి సర్వే చేస్తున్న సిబ్బందిలో ప్రజలు ప్రభుత్వాన్ని చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నవారు సిబ్బందిపై ఆ కోపాన్ని చూపిస్తున్నారు. పెద్ద వయసువాళ్లు కూడా సీఎంను బూతులు తిడుతున్నారని సిబ్బంది మీడియాకు చెప్పారు. సర్వేకు వెళ్లిన ఎవరిని పలకరించినా ఇవే మాటలు. వారి వీడియోలు వైరల్ అవుతుండటంతో మీడియాతో మాట్లాడవద్దని సిబ్బందికి అధికారులు వార్నింగ్ ఇచ్చే పరిస్థితి వచ్చింది. నాలుగేండ్ల తర్వాత మళ్లీ ప్రజల ముందుకు వెళ్లినప్పుడు తాము ఇది చేశామని చెప్పుకొనేటట్టు పాలన ఉండాలి. అంతేకానీ, దేశంలో ఎక్కడా లేని విధంగా తాము ఇన్ని బూతులు తిట్టామని చెప్పుకొంటే ప్రజలు హర్షించరు. ప్రధాన మీడియాను దాటి సామాజిక మాధ్యమాలు ముందుకెళ్తున్న ప్రస్తుత తరుణంలో ఆ బూతులే కాంగ్రెస్ మెడకు చుట్టుకుంటాయి. ■

> **ప్రభుత్వ సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలు ఇచ్చారని గతంలో కేసీఆర్ సర్కార్‌ను ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయంటూ ఎన్నికలు జరుగుతున్న మహారాష్ట్రలో ప్రకటనలు ఇచ్చారు. మహిళలకు నెలకు రూ.2500, రైతుబంధు సహా అన్ని హామీలను నెరవేర్చినట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటు. వాస్తవానికి, మహిళలకు రూ.2500, రైతుబంధు సహా అనేక పథకాలు అమలుకావడం లేదన్న విషయం అందరికీ తెలుసు. అందుకే, ప్రధాని మోదీతో పాటు బీజేపీ నేతలు తెలంగాణలో అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీల గురించి మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారు.**

సావు లేని చరిత్ర

సత్తా ఉన్న చరిత్ర సావులేని చరిత్ర
తాలు చరిత్ర కాదు తగలడానికి
గాలి తన్నుకొని పోవడానికి
సుడిగాలి అయినా చూసి పోవాలి

రక్తం మరకల చరిత్ర
నరనరాన నెత్తుటి లిఖిత చరిత్ర
పోరాడిన వీరుని చరిత్ర

అంబేద్కర్ రాసిన
రాజ్యాంగ చరిత్ర సెడుపగలరా
అల్లూరి సీతారామరాజు పోరు వీరుని
అమరత్వం చరిత్ర సెడుపగలరా

సుభాష్ చంద్రబోస్
జీవ మరణ వార్త చెప్పగలరా సెడపగలరా
భగత్‌సింగ్ ప్రాణ త్యాగార్పణ
చరిత్ర తుడుపగలరా

చరిత్రను చెలిపే శక్తి
చరిత్ర సృష్టించిన వ్యక్తికే
చరిత్ర చెరపడం చేతకాదు
మరో మనిషి మరో వ్యక్తి చరిత్రకు
మసక రుయ్యగలడా

మరణం లేని చరిత్రలు
మనసులో పుడతాయి
మట్టిలో మొలకెత్తుతాయి

దేవరపాగ కృష్ణయ్య
99634 49579

దాడి కాదది.. తిరుగుబాటు!

రమేశ్‌చంద్ర

> **లగచర్ల రైతుల ఆవేశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్న పాలక పక్షం.. వారి సమస్య పరిష్కారానికి కనీస ప్రయత్నం కూడా చేయడం లేదు. సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించాల్సిన పాలకులు.. తమ అసమర్థత కారణంగా తలెత్తిన నిరసనలకు రాజకీయ రంగు పులుముతున్నారు. రైతులను ఒప్పించి భూములు తీసుకోవాల్సిన చోట బెదిరింపులకు దిగడమే దాడులకు కారణం. అయితే, దాడులు ఎక్కడ జరిగినా ఖండించాల్సిందే. కానీ, ఆ పరిస్థితికి దారితీసిన కారణాలను తెలుసుకోవడానికి ప్రయత్నించకపోవడం విచారకరం.**

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి మొదలు స్థానిక కాంగ్రెస్ నాయకుల వరకు భూములు ఇవ్వాల్సిందేనని.. ఇవ్వకున్నా తీసుకుని తీరుతామని మొదటినుంచి ప్రకటనలు చేస్తున్నారు. వారి ప్రకటనలు గిరిజనుల్లో భయాన్ని పెంచి దాడులకు పాల్పడేలా చేసిందనేది వాస్తవం. తమది ఆవేశం కాదని.. ఆవేదన అని.. తమ ఉనికిని కాపాడుకోవడానికి, తమ భవిష్యత్తు అంధకారం కాకుండా చూసుకోవడానికే పోరాటం చేస్తున్నామని వారు మొదటినుంచి అంటున్నారు. ఇరవై రోజుల క్రితం దుద్యాల మండల కాంగ్రెస్ నాయకుడిని లగచర్ల గ్రామస్తులు పరిగెత్తించి కొట్టారు. అయినప్పటికీ పాలకులకు వారి ఆవేదన అర్థం కాలేదు. దాని పర్యవసానమే తాజా ఉదంతం. ఇది కేవలం దాడి కాదు, ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు. అయితే, తమ భూములను కాపాడుకోవడానికి వారు చేస్తున్న పోరాటాన్ని చిన్నచూపు చూస్తూ.. తిరిగి వారినే నిందితులుగా చూపిస్తున్న వైనం హేయం.

ఒక పక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఫార్మాసిటీ కోసం 19 వేల ఎకరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించింది. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులూ సిద్ధ చేసింది. అయితే, ఇప్పుడు మంత్రులుగా ఉన్న అనేకమంది కాంగ్రెస్ నేతలు ఎన్నికల వేళ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఫార్మా వల్ల స్థానికుల బతుకులు భారమవుతాయని, పరిసరాలు విషతుల్యమవుతాయని ప్రచారం చేశారు. తమను గెలిపిస్తే ఫార్మాను రద్దు చేసి, భూములు వెనక్కి ఇప్పిస్తామని ఊదరగొట్టారు. ఇప్పుడు అదే నేతలు కొడంగల్‌లో ఫార్మా వద్దంటున్నవారిని అభివృద్ధి నిరోధకులుగా చిత్రీకరిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనం.

కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలో సుమారు 1375 ఎకరాలకు పైగా భూ సేకరణ జరిపి ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేయడంతో అగ్గి రాజుకుంది. దాదాపు పది నెలల నుంచి ఆయా గ్రామాల రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఆర్డీవోతో పాటు ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. తాము భూములు ఇచ్చేది లేదని, అభిప్రాయ సేకరణ పేరిట తమ గ్రామాలకు రావొద్దని వారు ఎప్పటినుంచో స్పష్టం చేస్తున్నారు. చెప్పినట్టే కొన్నిచోట్ల ఈ కార్యక్రమాలను బహిష్కరించారు. భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న గిరిజనులు అందుకు సహేతుకమైన కారణాలు చెప్పున్నారు. తమకు వ్యవసాయం తప్ప మరొకటి తెలియదని.. పరిశ్రమలు వచ్చినా తాము పెద్దగా చదువుకోలేదు కాబట్టి, ఉపాధి దొరకదని.. ప్రభుత్వం ఇస్తానంటున్న పరిహారం మార్కెట్ రేటుతో పోలిస్తే పది నుంచి ఇరవై శాతమే ఉందని వారు అంటున్నారు. ఈ గ్రామాల్లోని ఎకరం భూమికి ఇచ్చే పరిహారంతో వేరే ప్రాంతంలో పావు ఎకరం కూడా రాదు. మరేం చేయాలి. ఒక పక్క భయపెడుతున్న అధికారులు, మరోపక్క భూములు ఇవ్వాల్సిందేనని, లేకపోతే గుంజుకుంటామని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారాలు.. వెరసి ఆ ఐదు గ్రామాల ప్రజలకు తమ భవిష్యత్తు అంధకారంగా కనిపించింది. ఇక్కడే ప్రభుత్వం పొరపాటు చేసింది. పరిహారం పెంచి, వారికి ఏదో ఒక విధంగా లాభం కల్పిస్తామని నచ్చచెప్పాల్సిందిపోయి.. అధికార మదాన్ని చూపించి వారి భూములను ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో తప్పనిసరై రైతులు తిరగబడ్డారు. వారి ఆవేదన ఆవేశంగా మారి విచక్షణ కోల్పోయేలా చేసింది.

ఫార్మాకు భూములు ఇవ్వాల్సిందేనని, ఇవ్వకున్నా తీసుకుంటామని బెదిరించిన దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌ను గిరిజన రైతులు తరిమి తరిమికొట్టారు. అతికష్టం మీద అక్కడి నుంచి అతన్ని పోలీసులు తీసుకెళ్లారు. ఆయనపై దాడిచేసిన వారిలో రాజకీయ నాయకులు ఎవరూ లేరు, బాధిత రైతులు తప్ప. అయినప్పటికీ ప్రభుత్వం తన తీరును మార్చుకోలేదు. మళ్లీ మళ్లీ అధికారులు, కాంగ్రెస్ నేతలను ఆయా గ్రామాలను పంపించి రైతులను భయపెడుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో తమకు జీవనాధారమైన భూములను బలవంతంగా గుంజుకుంటారేమోనని వారు ఆందోళనకు గురవడంతో తాజా దాడులు జరిగాయి.

> **అధికారులపై రైతులు దాడి చేయడం తప్పే. కానీ, అదే రోజు రాత్రి ప్రభుత్వం, పోలీసులు చేసిందేమిటి? ఇంటర్‌నెట్, ఫోన్ సిగ్నల్స్ బంద్ చేసి, కరెంటు తీసేసి ఇల్లిల్లూ సోదా చేసి మహిళలు వద్దని వారిస్తున్నా, చిన్న పిల్లల్లు భయపడి ఏడుస్తున్నా దొరికినవారిని దొరికినట్టు అక్రమంగా అరెస్టు చేయడం సమంజసమేనా? ఈడ్చుకుంటూ తీసుకెళ్లడానికి, ఇష్టమొచ్చినట్టు కొట్టడానికి వారేమైనా సంఘవిద్రోహ శక్తులా? రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజాసంఘాలు ఖండించాయి.**

సొంత నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నా సీఎం స్పందించకపోవడం విడ్డూరం. గిరిజన రైతుల రైతుల్లో నెలకొన్న భయాన్ని తొలగించాల్సిన ప్రభుత్వమే వారిని మరింతగా భయాందోళనకు గురిచేస్తున్నది. వారితో మాట్లాడి ఒప్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కనీస ప్రయత్నం చేయలేదు, చేయడం లేదు కూడా. ఈ ఉదంతం తర్వాత కూడా కాంగ్రెస్ నేతలు మారడం లేదు. భూములు లాక్కొని తీరుతామని స్వయంగా సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి రైతులను హెచ్చరిస్తున్నారు. ఇలా వ్యవహరించడం ఎంతవరకు సబబు? మొన్న అశోక్‌నగర్.. నిన్న మూసీ, నేడు లగచర్ల.. రేపు మరో ప్రాంతం. అనుభవాల నుంచి పాలకులు పాఠాలు నేర్చుకోకపోతే.. గుణపాఠం నేర్పడం కూడా ప్రజలకు తెలుసు. గతంలో అనేక సార్లు ఇది నిరూపితమైంది. 11 నెలల్లో ఏ కోల్పోయామో తెలుసుకున్న ప్రజలకు తిరిగి వాటిని ఎలా సాధించుకోవాలో కూడా బాగా తెలుసు. ■

> **ఈ గ్రామాల్లోని ఎకరం భూమి కి ఇచ్చే పరిహారంతో వేరే ప్రాంతంలో పావు ఎకరం కూడా రాదు. మరేం చేయాలి. ఒక పక్క భయపెడుతున్న అధికారులు, మరోపక్క భూములు ఇవ్వాల్సిందేనని, లేకపోతే గుంజుకుంటామని కాంగ్రెస్ నేతల ప్రచారాలు.. వెరసి ఆ ఐదు గ్రామాల ప్రజలకు తమ భవిష్యత్తు అంధకారంగా కనిపించింది.**



ఇది యూపీ కాదు, మహారాష్ట్ర!

> **ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన 'విడిపోతే చస్తాం' నినాదాన్ని నేను సమర్థించను. కొంతమంది బీజేపీ నేతలు కూడా ఈ నినాదం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. యూపీ, ఝార్ఖండ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాల్లో ఇది పని చేస్తుందేమో. సాధువులు, శివ భక్తులు నడియాడిన నేల మహారాష్ట్రకు అది తగినది కాదు. అయినా ఇది యూపీ కాదు, మహారాష్ట్ర.**
>
> **- అజిత్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి**

మా ఊరి రాంరెడ్డి రోజు లాగానే మొన్న రాత్రి కూడా టీవీ చూస్తున్నడు. తనకు ఇష్టమైన ఆంధ్ర దీపం చానల్ పెట్టిండు. 'తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుంట చేస్తా'నని తన ప్రియతమ నాయకుడు శపథం చేయడాన్ని రాంరెడ్డి చూసిండు. అప్పటికే ఊరిలోని బెల్టుషాపులో చీపులిక్కర్ తాగిన ఆయన తాను కూడా ఈ మహాయజ్ఞంలో సమిధ కావాలని బలంగా నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత నిద్రలోకి జారుకున్నాడు.

ఆనవాళ్లు చెరిపేద్దామా?

యం.డి.జమీలొద్దీన్
86862 11556

పొద్దున లేవగానే రాత్రి చేసిన శపథం రాంరెడ్డికి గుర్తుకొచ్చింది. ఈ రోజు ఎట్లయిన సరే కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేసుడేనని మనసులో గట్టిగా అనుకున్నడు. ముందుగాల రెడీ అవుదామని.. పండ్ల పుల్ల కోసం ఇంటి బయట ఉన్న వేప చెట్టు దగ్గరకి పోయిండు. అక్కడ హరితహారం కార్యక్రమంలో నాటిన చెట్లలో ఆయనకు కేసీఆర్ కనిపించిండు. ఇన్ని కోట్ల చెట్లు ఎట్లా పీకాలె, కేసీఆర్ ఆనవాళ్లను ఎట్లా చెరిపేయాలో రెడ్డి సాబ్‌కు అర్థం కాలె!

పండ్ల పుల్ల వేసుకొని ఇంటి మూలమలుపులకు వెళ్లేసరికి పాడుబడ్డ బోరింగ్‌ను చూడంగనే కాంగ్రెస్, టీడీపీ హయాంలో దాని పూర్వవైభవం గుర్తుకొచ్చింది. బిందెడు నీళ్ల కోసం తమ వాడలోని ఆడవాళ్లు కొట్టుకొని పోలీస్ స్టేషన్‌కు పోయిన విషయం యాది కొచ్చింది. ఇప్పుడు ఎవరి ఇండ్లల్లో వాళ్లు నీళ్లు పట్టుకుంటున్నరు. ఆ మిషన్ భగీరథ నీళ్లలో మళ్లీ కేసీఆర్ కనిపించిండు రాంరెడ్డి సాబ్‌కు. చెరువు కింది పొలానికి నీళ్లు పెడదామని బయల్దేరిన రెడ్డి సాబ్‌కు మిషన్ కాకతీయ పథకంలో బాగు చేసిన చెరువు నిండుకుండలా స్వాగతం పలికింది. ఆ చెరువులోనూ కేసీఆర్ కనిపించిండు. చెరువులో వలలు వేసి ఒక్కొక్కటి 10 కిలోలు పెరిగిన చేపలు పట్టి మురిసిపోతున్న మత్స్యకారుల ముఖంలోనూ కేసీఆరే.. చెరువు కట్టపై పెరిగిన ఈత వనంలో కేసీఆరే.. పోయేటప్పుడు ఆయనకు ఎదురొచ్చిన గొర్ల మంద మేపుతున్న వ్యక్తిలో కూడా కేసీఆరే కనిపించిండు రెడ్డి సాబ్‌కు.

> **తన పొలంలో మోటరు సాలు జేస్తుంటే.. కాంగ్రెస్, టీడీపీ హయాంలో దొంగ రాత్రి కరెంటు పెట్టబోయి పాము కాటుకు గురై చనిపోయిన పాలేరు మల్లయ్య యాదికొచ్చిండు. పొలానికి వస్తున్న 24 గంటల ఉచిత కరెంటు కేసీఆర్ పుణ్యమేనని గుర్తు జేసుకుండు. అప్పట్లో ఎకరం పారించని తన బాయి ఇయ్యాళ కాళేశ్వరం పుణ్యమాని భూగర్భ జలాలు పెరిగి, 5 ఎకరాలు పారిస్తున్న విషయం తెలిసొచ్చింది. అక్కడా కేసీఆరే.**

మొన్నటివరకు పెట్టుబడికి రైతుబంధు ఇచ్చిన కేసీఆర్ పచ్చని పంటలో కనిపించిండు. దొడ్డు వడ్లు కొనబోమని కేంద్రం అంటే.. 'మా రైతుల వడ్లు మేమే కొంట'మని అన్నదాతను ఆదుకున్న కేసీఆర్ గుర్తుకొచ్చిండు రెడ్డి సాబ్‌కు. ఇంటికి వచ్చే తోవలో గడ్డం చేయించుకోవడానికి పోతే రెండు ఫ్యాన్లకు ఫ్రీగా అందుతున్న కరెంటులోనూ కేసీఆర్ ఉన్నడు. ఇంటికి వస్తే నాడు కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీర కట్టుకున్న పటేలమ్మ కనిపించింది. బావతో గొడవపడి ఇంటి మీద ఉన్న చెల్లెకు వస్తున్న ఒంటరి మహిళా పింఛన్ కూడా కేసీఆర్ ఇచ్చిందేనని యాదికి వచ్చి మనసు చలించిపోయింది రెడ్డి సాబ్‌కు. స్నానం చేసుకొని అంగీ ఇస్త్రీ చేయించుకోవడానికి వెళ్తే బొగ్గుల ఇస్త్రీ పెట్టెకు బదులు వాడుతున్న కరెంటు పెట్టెలో కూడా కేసీఆర్ కనిపించిండు. కొడుకును బడిలో దించడానికి పోతే 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా నూతన సొగబులు దిద్దుకున్న బడి కనబడ్డది. కొడుకు మధ్యాహ్నం తింటున్న సన్న బువ్వలో కేసీఆర్ కనిపించిండు. తన పెద్ద బిడ్డ చదువుకుంటున్న గురుకుల పాఠశాలలో కూడా కేసీఆర్ ఆనవాళ్లే ఉన్నయి. భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ ఆఫీసుకు పోయిన రెడ్డి సాబ్‌కు తమ ఊరిని కేసీఆర్ సర్కార్ మండలం కేంద్రంగా చేసిన విషయం యాది కొచ్చింది. గతంలో భూముల రిజిస్ట్రేషన్ కోసం సమర్పించుకున్న ముడుపులు గుర్తుకొచ్చినయి. ఏ ఇబ్బంది లేకుండా నేడు జరుగుతున్న రిజిస్ట్రేషన్, కొత్త పాస్‌బుక్‌లో కేసీఆర్ దర్శనమిచ్చిండు.

> **మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి తారుతో వేసిన డబుల్ రోడ్డులో కేసీఆర్ మెరుస్తున్నడు. నూతనంగా ఏర్పాటైన జిల్లా కేంద్రంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఆఫీసులో కేసీఆరే కనిపిస్తున్నడు రెడ్డి సాబ్‌కు.**

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి అరుగుపై కూర్చొని బీడీలు చుడుతూ కొంతమంది మహిళలు కనిపించారు. బీడీలు చుడుతూ వాళ్లు పొందుతున్న పింఛన్‌లోనూ కేసీఆర్ ఉన్నడు. తన తల్లికి వస్తున్న వృద్ధాప్య పింఛన్‌లోనూ కేసీఆర్ కనిపిస్తున్నడు రెడ్డి సాబ్‌కు. తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పుడు ఏ పైరవీ లేకుండానే ఇంటికొచ్చిన రూ.5 లక్షల రైతుబీమా రెడ్డి సాబ్‌కు యాదికొచ్చింది. సైరన్ మోగిస్తూ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల ఇన్నోవా వాహనంలోనూ కేసీఆర్ ఆనవాళ్లు కనిపించినయి. ఇంటి బయట తళతళ మెరుస్తున్న ఎల్ఈడీ వీధి దీపాల్లోనూ కేసీఆర్ ఉన్నడు. 24 గంటలు నాణ్యమైన కరెంటు రావడంతో తన ఇంట్లో మూలకు పడిన ఇన్వర్టర్‌లో కేసీఆర్ కనిపించిండు రెడ్డి సాబ్‌కు.

అంతలోనే రెడ్డి సాబ్‌కు తన తమ్ముడు ఫోన్ జేసిండు. కేసీఆర్ హయాంలోనే బాగుండేదని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ వల్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని, హైదరాబాద్‌లో అనేక కంపెనీలు కొలువయ్యాయని, తద్వారా లక్షల ఉద్యోగాలు వచ్చాయని.. ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కార్ నిర్వాకం వల్ల శాంతిభద్రతలు క్షీణించి, పెట్టుబడులు రాక, ఉన్న ఐటీ ఉద్యోగం కూడా ఊడిందని ఆవేదనచెందిండు. దీంతో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం సాధ్యం కాదని, రెడ్డి సాబ్‌కు అర్థమైంది. 'ఒరేయ్ తమ్ముడు! తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ ఆనవాళ్లు ఉంటాయి. యూట్యూబ్ చానళ్లు, కుహనా మేధావుల మాటలు విని మోసపోయి ఇప్పుడు గోసపడుతున్నం' అని చెప్పుడు రాంరెడ్డి వంతైంది.